సాక్షి
ఒడిశా

శనివారం । 24 । ఆగస్టు । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ.3,75,567
- భువనేశ్వర్/పూరీ



కల్తీసారా ఘటనపై విపక్షాల మండిపాటు

గంజాం జిల్లాలో చికిటి కల్తీసారా మృత్యు ఘటనపై ప్రతిపక్ష బిజూ జనతా దళ్, కాంగ్రెస్ సభ్యులు రాష్ట్ర శాసనసభలో శుక్రవారం మండిపడ్డారు. - 8లో



నకిలీ మావోయిస్టు అరెస్టు

నకిలీ మావోయిస్టును మల్కన్‌గిరి పోలీసులు అరెస్టు చేశారు. - 8లో

న్యూస్‌రీల్

బీడీవో పెద్ద మనసు



విద్యార్థికి ఫీజు డబ్బులు అందజేస్తున్న బీడీవో మనోజ్ పాణిగ్రాహీ

కొరాపుట్: తరచూ సామాజిక మాధ్యమాల ద్వారా వెలుగులోకి వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకునే నబరంగ్‌పూర్ జిల్లా తెంతులకుంటి బీడీవో మనోజ్ పాణిగ్రాహీ మరోసారి ఔదార్యం ప్రదర్శించారు. తెంతులకుంటిలో చింటూ నాగ్ అనే విద్యార్థి ప్లస్ 2 ఫీజు కట్టలేక చదువు ఆపేస్తున్నట్లు సోషల్ మీడియాలో ప్రకటించాడు. ఇది చూసిన బీడీవో ఆ విషయంపై సమాచారం సేకరించారు. పేదరికంతో జీవిస్తున్న చింటూ నిజంగానే ఆ పరిస్థితి ఎదుర్కొంటున్నాడని ధ్రువీకరించుకున్నారు. సిబ్బంది ద్వారా మనోజ్‌ని తన చాంబర్‌కి పిలిపించి అవసరమైన ఫీజు రూ.7,500ని తన సొంత డబ్బులు నుంచి ఇచ్చారు. దీంతో బీడీవోకు అందరూ అభినందనలు తెలిపారు.

సుదర్శన్ పట్నాయక్‌కు సత్కారం



సుదర్శన్ పట్నాయక్‌ను సత్కరిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: ప్రముఖ సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ పారిస్ ఒలింపిక్స్ భారత్ హాకీ జట్టు నుంచి ప్రత్యేక సత్కారం అందుకున్నారు. సైకత శిల్పాలతో క్రీడకు చేసిన విశిష్ట సహకారానికి హాకీ ఇండియా ఆయనను సన్మానించింది. అతని అద్భుతమైన కళ హాకీకి ఐకానిక్ ప్రాతినిధ్యంగా మారిందని, ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను ఆకర్షించిందని పేర్కొన్నారు. ఆటను వినూత్నంగా, ఉద్వేగభరితంగా ప్రచారం చేసినందుకు హాకీ భారత్ అధ్యక్షుడు దిలీప్ తిర్కీ కృతజ్ఞతలు తెలిపారు.

దాదాగిరి చేస్తున్న వ్యక్తి అరెస్టు



అరెస్టైన నిందితుడు రవీంద్ర బారిక్

జయపురం: ఒక కాంట్రాక్ట్ సంస్థ ఉద్యోగులను భయపెట్టి దాదాగిరి చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర్ తండి శుక్రవారం వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. జయపురం సమితి భొరడాపుట్ –కుసిమి ప్రధాన రోడ్డు పనులు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా గత నెల జూలై 28వ తేదీన రాత్రి రోడ్డు కాంట్రాక్టు సంస్థ మేనేజర్ ప్రసన్న పాత్రో పనివారికి తినటానికి భోజనం ఇచ్చి, తిరిగి వస్తుండగా జయపురం సమితి బొడొకావిడి గ్రామానికి చెందిన రవీంద్ర బారిక్ అతడికి ఫోను చేశాడు. తాను కొద్ది రోజుల క్రితం జైలు నుంచి వచ్చానని, తనకు మామూళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే చంపుతానని హెచ్చరించారు. అనంతరం మరొక వ్యక్తితో కలిసి కంట్రాక్టర్ కార్యాలయానికి వచ్చారు. మారణాయుధాలు చూపించి అక్కడ ఉన్నవారిని భయభ్రాంతులకు గురి చేశారు. దీంతో మేనేజర్ ప్రసన్న పాత్రో, అతడి డ్రైవర్లు భయంతో సమీప ఏకలవ్య పాఠశాల వద్ద దాగున్నారు. అనంతరం కార్యాలయంలో సామాన్లు ధ్వంసం చేశారు. దీంతో గగణాపూర్ పోలీసు స్టేషన్‌లో మేనేజర్ ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన అధికారులు రవీంద్రబారిక్‌ను గురువారం అరెస్టు చేశారు. అతడిపై గతంలో కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

భారీగా గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయితో నిందితులు, పోలీసులు

రాయగడ: అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు యువకులను ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. వారి నుంచి 41.600 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని కోర్టుకి తరలించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సంజయ్ కుమార్ తెలిపిన వివరాలు మేరకు.. గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు స్థానిక రైల్వేస్టేషన్ ఆర్పీఎఫ్ పోలీసుల సహకారంతో గురువారం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా బీహార్‌కి చెందిన మహ్మద్ నఫీ, ఓసామా అన్సారి అనే యువకుల బ్యాగ్‌లను తనిఖీ చేయగా అందులో గంజాయి పట్టుబడింది.

ఆస్పత్రి జలమయం

బాలాసోర్‌లో కురిసిన భారీ వర్షానికి జిల్లా ప్రధాన ఆస్పత్రిలోకి వర్షపు నీరు ప్రవేశించింది. పలు వార్డుల్లో వాన నీరు ఏరులై పారింది. ఆసుపత్రి ప్రాంగణంలో నిరామయ ఔషధ కేంద్రాలు, మరికొన్ని ఓపీడీ వార్డులు జలమయమయ్యాయి. నీరు చేరడంతో వార్డులోని రోగులు భయాందోళనకు గురవుతున్నారు. - భువనేశ్వర్







కొఠియాలో ఏపీ గ్రామ సభలు



భద్రలో గ్రామసభ నిర్వహిస్తున్న ఆంధ్రా అధికారులు

కొరాపుట్: ఆంధ్రా–ఒడిశా వివాదస్పద ప్రాంతం కొఠియాలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామసభలు శుక్రవారం నిర్వహించింది. కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కొఠియా గ్రామ పంచాయతీ పరిధి పగులు చెన్నూరు, పట్టు చెన్నూరు, గంజాయి భద్ర గ్రామాల్లో గిరిజనులతో ఆంధ్రా అధికారులు భేటీ అయ్యారు. అక్కడి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కోసం ఒకే రోజు గ్రామ సభలు నిర్వహించింది. దీనిలో భాగంగా మూడు గ్రామాల్లో ఈ సభలు జరిగాయి. ఈ ప్రాంతంలో మొత్తం 21 గ్రామాలు వివాదస్పదంగా రెండు రాష్ట్రాల రికార్డుల్లో ఉన్నాయి. ఈ వివాదం తేలేంతవరకు అక్కడ స్టేటస్ కో అమలు చేయాలని గతంలో సుప్రీంకోర్టు ఆదేశించింది. గ్రామ సభల్లో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరావు(పగులు చెన్నూరు), సురేష్ (పట్టు చెన్నూరు), సూర్యనారాయణ(గంజాయి భద్ర)లు పాల్గొన్నారు.

ఏడేళ్ల తర్వాత ఇంటికి..!



రాంబతి, రమేష్ దంపతులకు అభినందనలు తెలుపుతున్న బీడీవో తదితరులు

కొరాపుట్: ఏడేళ్ల క్రితం మతి స్థిమితం కోల్పోయి ఇల్లు వదలి వెళ్లిపోయిన మహిళ సురక్షితంగా ఇంటికి చేరిన అరుదైన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నబరంగ్‌పూర్ జిల్లా కొసాగుమ్మ సమితి బెలగాం గ్రామ పంచాయతీ దొండాగుడ గ్రామానికి చెందిన రంబతి బోత్ర ఏడేళ్ల క్రితం మతి స్థిమితం కోల్పోయి ఇల్లు వదలి వెళ్లిపోయింది. దీంతో ఆమె భర్త రమేష్ బోత్ర, ఇద్దరు కుమారులు, కుమార్తె అనేక చోట్ల వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో చనిపోయి ఉంటుందనే ఆలోచనతో వెతికే కార్యక్రమాన్ని వదిలిపెట్టారు. అయితే సుమారు ఏడేళ్ల పాటు అనేక ప్రాంతాలు తిరిగిన రంబతిను మహారాష్ట్రలో కొడక్కి ప్రాంతంలో సుశిఖ్య జాగృతి మహిళా రాజగృహ అనే స్వచ్ఛంద సంస్థ చేరదీసింది. కొద్దిరోజుల క్రితం కోలుకున్న రాంబతి మాట్లాడుతూ తనది ఒడిశా రాష్ట్రంలోని కొసాగుమ్మ అని వాళ్లకు చెప్పింది. దీంతో సంస్థ ప్రతినిధులు కొసాగుమ్మ బీడీవో ఆశిష్ త్రిపాఠికి ఈ సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన ఆయన దొండాగుడ గ్రామానికి సిబ్బందిని పంపి తనకు వచ్చిన సమాచారం నిజమని ధ్రువీకరించుకున్నారు. ఆమె కుటుంబ సభ్యులు, గ్రామ సర్పంచ్, ఒక ప్రభుత్వ అధికారిని బృందంగా చేసి మహారాష్ట్ర పంపించారు. అక్కడ తన భర్త రమేష్‌ని రంబతి గుర్తు పట్టింది. దీంతో ఆమెను చూసిన కుటుంబ సభ్యులు ఆనందంతో ఉప్పొంగిపోయారు. శుక్రవారం ఉదయం వారంతా కొసాగుమ్మ బీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం స్వగ్రామానికి వచ్చారు.

ఎన్నాళ్లు ఎదురుచూడాలో..!



సంతోష్(ఫైల్)

జయపురం: వలస కార్మికుడిగా చెన్నై వెళ్లి ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్న ఒక యువకుడి మృతదేహం ఐదు రోజులు దాటినా ఇంకా ఇంటికి చేరకపోవడంతో చివరి చూపు కోసం ఎదురు చూస్తూ అతని కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. వివరాల్లోకి వెళ్తే.. జయపురం సబ్ డివిజన్ కుంద్ర సమితి గుండేల్ పంచాయతీ గుండేల్ గ్రామానికి చెందిన సంతోష్ బలియ(20) పనుల కోసం వలస కార్మికుడిగా చెన్నై వెళ్లాడు. అయితే అక్కడ అతను ఈనెల 18వ తేదీన ఒక చెట్టుకు ఉరిపోసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. రెండు నెలల కిందట సంతోష్ మరికొంత మందితో కలిసి చెన్నై వెళ్లాడని, అక్కడ వన్ టైమ్ అనే కంపెనీలో పనిచేస్తున్నట్లు తెలిపాడని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అయితే ఈనెల 20వ తేదీన ఒక యువకుడు తమకు ఫోన్‌చేసి సంతోష్ బలియ ఈనెల 18వ తేదీన ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపాడని వెల్లడించారు. ఈ విషయంపై తాము ఆ కంపెనీ మేనేజర్ కాశీనాథ్ బెహరకు ఫోన్ చేయగా, సంతోష్ మృతదేహాన్ని పోస్టుమార్టం తర్వాత పంపుతామని తెలిపారు. అయితే నేటి వరకు మృతదేహం తమకు చేరలేదని వాపోతున్నారు.

డాన్స్ బార్లను పూర్తిగా మూసివేస్తాం

- మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్



పృథ్వీరాజ్ హరిచందన్

భువనేశ్వర్: రాష్ట్రంలో డ్యాన్స్ బార్‌లను పూర్తిగా మూసివేస్తామని అబ్కారీ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ శుక్రవారం అసెంబ్లీలో తెలిపారు. ఒడియా ఆత్మ గౌరవం పరిరక్షణ కోసం సరికొత్త అబ్కారీ విధానం ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. పాఠశాలలు, కళాశాలలు, దేవాలయాల సమీపంలో మద్యం దుకాణాలు ఉండకూడదన్నారు. మద్యం వ్యాపార నెట్‌వర్క్‌ను పూర్తిగా నిర్మూలించడం, కొత్త అబ్కారీ విధానంలో కీలకమైన అంశంగా పేర్కొన్నారు.

నిర్వహణ పనులకు శ్రీకారం

- రత్న భాండాగారం ఖాళీ బీరువాలు తరలింపు
- సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపివేత

భువనేశ్వర్: శ్రీమందిర్ రత్న భాండాగారం నిర్వహణ పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. నగలు, ఆభరణాలు తొలగించిన తర్వాత ఖాళీ బీరువాలు, చెక్క పెట్టెలు బయటకు తీసి వాటిని ప్రత్యేకంగా సురక్షిత ప్రాంతానికి తరలించారు. దీంతో వీటిని ఇప్పుడు నీలాద్రి మ్యూజియం సమీపంలోని గదికి మార్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన నిర్ధారిత కార్యాచరణ (ఎస్‌ఓపీ) ప్రకారం ఈ పనులు కొనసాగుతాయని పర్యవేక్షక కమిటీ వర్గాలు తెలిపాయి. ఈ ప్రక్రియ ఏకబిగిన పూర్తి చేయాల్సి ఉండడంతో సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపివేశారు.

ఆనంద్ బజార్ యథాతథం

ఖాళీ సామగ్రి తరలింపు సమయంలో ఆనంద్ బజార్ యథాతథంగా పని చేసింది. ఈ ప్రాంగణంలో స్వామి మహా ప్రసాదం కొనుగోలుకు ఏమాత్రం అంతరాయం కలగలేదు. శ్రీమందిరం సింహద్వారం గుండా 22 మెట్ల మార్గంలో ఆనంద్ బజార్ వైపు వెళ్లేందుకు వెసులుబాటు కల్పించారు. రత్న భాండాగారం వెలుపలి, లోపలి గదుల్లో 3 చెక్క బీరువాలు, ఒక స్టీల్ బీరువా, 2 చెక్క పెట్టెలు, ఒక ఇనుప పెట్టె ఉన్నాయని శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏవో డాక్టరు అరవింద్ కుమార్ పాఢి తెలిపారు. అందులోని ఆభరణాలన్నీ పడక గది, చాంగ్డా గృహానికి సమీపంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. ఆలయ ఆభరణాలను పరిశీలించేందుకు 12 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి(సీఏఓ) డాక్టర్ అరవింద్ కుమార్ పాఢి, జిల్లా మేజిస్ట్రేట్ సిద్ధార్థ్ శంకర్ స్వంయి, రత్న భాండాగారం పర్యవేక్షణ కమిటీ అధ్యక్షుడు జస్టిస్ విశ్వనాథ్ రథ్, సభ్యుడు చార్టర్డ్ అకౌంటెంట్ రాజీవ్ సాహు, శ్రీమందిరం పాలక మండలి సభ్యుడు దుర్గాప్రసాద్ దాస్ మహాపాత్రో, సీనియర్ సేవాయత్ మధుసూదన్ సింఘారి, ఛాత్తీసా నియోగి నాయక్ జనార్దన్ పట్టజోషి మహాపాత్రో, జగన్నాథ్ దాస్ మహాపాత్రో, సోమేంద్ర ముదులి, భండార్ మేకప్ గణేష్ మేకప్, తాఢావు కొరొణొ సుధాంశు శేఖర్ పట్నాయక్, దెవులో కొరొణొ చంద్రశేఖర్ మంగరాజ్ ప్రధాన్ కమిటీలో ఉన్నారు.

విజిలెన్స్

భువనేశ్వర్: ఢెంకనాల్ సదర్ రేంజర్ బిభుదానంద మిశ్రాను విజిలెన్స్ అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. అక్రమాస్తుల ఆరోపణతో చేపట్టిన దాడుల నేపథ్యంలో అరెస్టు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. కటక్ జిల్లా అఠాగొడా ప్రాంతంలో ఉన్న అతని ఫామ్ హౌస్‌లో నెమళ్లు గుర్తించి వన్యప్రాణుల చట్టాల ఉల్లంఘనపై సైతం కేసు నమోదు చేశారు. ఫామ్ హౌస్ నుంచి 4 నెమళ్లను స్వాధీనం చేసుకొని అటవీ శాఖకు అప్పగించారు.

భువనేశ్వర్: ఒడిశా స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ (ఓఎస్ఆర్టీసీ) ఆర్థిక సలహాదారు, చీఫ్ అకౌంట్స్ అధికారి బిజయ కుమార్ మంగరాజ్ ఆస్తుల సోదా చేస్తున్నట్లు రాష్ట్ర విజిలెన్స్ వర్గాలు తెలిపాయి. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై ఏకకాలంలో భువనేశ్వర్, బరిపదాలోని 7 చోట్ల సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో 8 మంది డీఎస్పీలు, 8 మంది ఇన్‌స్పెక్టర్లు, 9 మంది ఏఎస్‌ఐలు, ఇతర సహాయక సిబ్బంది స్థానిక ప్రత్యేక జడ్జి, విజిలెన్స్ జారీ చేసిన సెర్చ్ వారెంట్ల బలంతో సోదాలు నిర్వహిస్తున్నారు.

రిమాండ్‌కు తరలింపు

భువనేశ్వర్: సిమ్ బాక్స్ సెట్ రాకెట్‌లో ప్రధాన సూత్రధారి అసదుర్ జమాన్ గురించి వివరాలు వెల్లడించిన ఒకరోజు తర్వాత, కమిషనరేట్ పోలీసులు శుక్రవారం కీలక నిందితుడు రాజు మండల్‌ను మరో రెండు రోజుల రిమాండ్‌కు తరలించారు. ఇతను భువనేశ్వర్‌లోని ఒక ఇంటిలో రూటర్లు, ఇతర పరికరాలతో పాటు 1,000 యాక్టివేట్ సిమ్ కార్డ్‌లతో ఆగస్టు 17న అరెస్టయ్యాడు. ఒక రోజు తర్వాత స్థానిక కోర్టు ఒడిశా పోలీసులకు మండల్‌కు ఐదు రోజుల రిమాండ్ మంజూరు చేసింది. దీంతో మండల్, అసదుర్ మధ్య ఉగ్రవాద సంబంధాలపై దర్యాప్తు చేయడానికి ఒడిశా పోలీసులు ఎన్ఐఏ, ఇంటర్‌పోల్ నుంచి సహాయాన్ని కూడా కోరారు. మండల్ అసదుర్ నుంచి పరికరాలు, నకిలీ సిమ్ కార్డులను సేకరించి, ఆపై వాటిని కటక్, భువనేశ్వర్ మరియు రాంచీలలోని మూడు అద్దె ఇళ్లలో అమర్చాడు. కటక్ మరియు భువనేశ్వర్ రెండింటిలోనూ సోదాల్లో మొత్తం 12 సిమ్ బాక్స్‌లు, 481 సిమ్ కార్డులు, అదనంగా 810 స్టాండ్ బై సిమ్ కార్డులు, రాంచీలోని మరో ఐదు సిమ్ బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సిమ్ బాక్సులను పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్, టర్కీ వంటి దేశాలకు అంతర్జాతీయ కాల్స్ చేయడానికి ఉపయోగించినట్లు తెలుస్తోంది. దీంతో తీవ్రవాద ప్రమేయం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అధ్యయనం



పర్యాటక ప్రాంతాలను సందర్శించిన ప్రభుత్వ అధికారులు

పర్లాకిమిడి: గజపతి జిల్లాల్లో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. ఈ మేరకు 50 మంది ప్రభుత్వ ఉప విభాగాల అధికారులు జిల్లాలోని పర్యాటక ప్రాంతాలైన గండాహతి, చంద్రగిరిలో బౌద్ధుల మందిరం, ఖసడా జలపాతాలను సందర్శించారు. అధికార బృందం సభ్యులు డీసీపీయూ అరుణ్ కుమార్ త్రిపాఠితో కలిసి పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధి, గిరిజనుల సంస్కృతి, పర్యాటక కేంద్రాల్లో రవాణా ఇతర విషయాలపై అధ్యయనం చేశారు. వారు శుక్రవారం స్థానిక గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రంలో డీఆర్‌డీఏ కార్య నిర్వాహణ అధికారి డా.గుణనిధి నాయక్, సబ్ కలెక్టర్ అనుప్ పండా, ఐటీడీఏ పీవో దిలీప్ కుమార్ బెహరా, అదనపు కార్యనిర్వాహణ అధికారి పృథ్వీరాజ్ మండల్, డిప్యూటీ కలెక్టర్ ప్రాణకృష్ణ పాణిగ్రాహితో ముచ్చటించారు. సమావేశంలో హోం శాఖ డిప్యూటీ సెక్రటరీ తరుణ్ కుమార్ బిశ్వాల్, రబినారాయణ బారిక్, డిప్యూటీ కలెక్టర్ సుచిస్మితా మరియు, జిల్లా సాంస్కృతిక అధికారి అర్చనా మంగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథం ప్రారంభిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: పట్టణంలోని కలెక్టరేట్ ఆవరణలో జిల్లా పాలనాధికారి బిజయ కుమార్ దాస్ పీఎం జన్‌మన్ ప్రచార రథాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ ప్రచార రథం సెప్టెంబర్ 10వ తేదీ వరకు పీఎం పేదల కల్యాణ యోజన, పీఎం ధనజన యోజన, పీఎం కిసాన్, కిసాన్ సమ్మాన్ నిధిపై షెడ్యూల్డ్ గ్రామాలకు సమాచారం చేరవేస్తుంది. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో దిలీప్ కుమార్ బెహరా, సీడీఎంవో డా.మహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

రెండుకి చేరిన మృతుల సంఖ్య

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితి బాగ్దేరి పంచాయతీ ముండపుట్ గ్రామంలో అతిసార మృతుల సంఖ్య రెండుకి చేరింది. ఆ గ్రామంలో ఇటీవల వాంతులు విరోచనాలతో ఒకరు మరణించగా, మరో 8 మంది హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. కాగా శుక్రవారం మరో వ్యక్తి బుదాయి శాంత(72) మరణించారు. బుదాయి శాంత హాస్పిటల్‌లో చికిత్స పొందగా, అతడి పరిస్థితి మెరుగవ్వడంతో గురువారం డిశ్చార్జి చేశారు.

అయితే ఇంటికి వచ్చిన తర్వాత బుదయి శాంత ఆరోగ్య పరిస్థితి మరలా క్షీణించి అతడు మరణించాడు. బుదాయికి వాంతులు విరోచనాలు తగ్గినా వృద్ధాప్యం, మొదలగు కారణాల వలన మరణించాడని డాక్టర్ గణేష్ ప్రసాద్ దాస్ వెల్లడించారు.

కొండచిలువ కలకలం



భారీ కొండచిలువ

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా జొరిగాం సమితి ఇచ్ఛాపూర్‌లో భారీ కొండచిలువ కలకలం సృష్టించింది. గ్రామ సర్పంచ్ దిగంబర్ బోత్ర తన మొక్కజొన్న పొలంలో వ్యవసాయ పనులు శుక్రవారం చేసుకుంటున్నాడు. ఇంతలో భారీ కొండ చిలువ అతని మీదకు వచ్చింది. అయితే పాములు పట్టడం అలవాటు ఉన్న దిగంబర్ దానిని నేర్పుగా బంధించి జొరిగాం అటవీ శాఖ కార్యాలయానికి తీసుకొచ్చాడు. అటవీ శాఖ రేంజర్ గోవింద నాయక్‌కి అప్పగించాడు. దీంతో సిబ్బంది కొండ చిలువని స్వాధీనం చేసుకున్నారు. దానిని పీఆర్‌ఎఫ్ అటవీ ప్రాంతంలో సురక్షితంగా విడిచి పెడతామని ప్రకటించారు.

క్లుప్తంగా

నేడు జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

నరసన్నపేట: స్థానిక జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా శనివారం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారావు తెలిపారు. హెచ్‌సీఎల్ కంపెనీ ఈ జాబ్‌మేళా నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఇంటర్‌లో బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. అభ్యర్థులు 75 శాతం మార్కులు పై బడి సాధించి ఉండాలన్నారు. దీంట్లో ఉద్యోగ అవకాశాలు పొందగలిగే వారు ఇంటర్వ్యూలో అర్హత సాధించాల్సి ఉంటుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు మధురై లో 3 నెలలు శిక్షణ ఉంటుందని, అనంతరం 9 నెలలు ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుందని తెలి పారు. ఈ సమయంలో నెలకు పది వేలు స్టైఫెండ్ ఇస్తారని అనంతరం రూ.1.75లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగం పొందుతారని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వచ్చి పాల్గొనవచ్చన్నారు.

ఇసుక వాహనాల పట్టివేత



ఆమదాలవలస పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న వాహనాలు

ఆమదాలవలస: మండల పరిధిలో నాగావళి నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న వాహనాలను శుక్రవారం ఆమదాలవలస ఎస్‌ఐ కె.వెంకటేష్, పోలీసులు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. నెల్లిమెట్ట గ్రామ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో చిలకపాలెం గ్రామానికి చెందిన ఇసుకతో ఉన్న లారీ మరో ఖాళీ లారీతో పాటు రెండు ట్రాక్టర్లు ఒక జేసీబీని సీజ్ చేశారు. ఇసుక తవ్వకాలు జరుపుతున్న వ్యక్తులను విచారించగా వారి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేవని రుజువు కావడంతో కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేయడం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు.

కల్తీ ఇసుక విక్రయం



పాతసుందరపాలెం సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన కల్తీ ఇసుక



రేగపాలెం తోటల్లో అర్ధరాత్రి పోగు చేసిన కల్తీ ఇసుక

రణస్థలం: మండలంలోని కొచ్చెర్ల పంచాయతీలో గల పాతసుందరపాలెం, లావేరు మండలంలోని రేగపాలెం సరిహద్దు ప్రాంతాల్లోని అటవీ భూముల్లో కొందరు వ్యక్తులు అక్రమంగా కల్తీ ఇసుకను నిల్వ చేసి తదుపరి అర్ధరాత్రులు ఇతర ప్రాంతాలకు భారీ లారీల్లో రవాణా చేస్తున్నారని ఆ పరిసర ప్రాంత గ్రామస్తులు చెబుతున్నారు. ఇసుక కొరతను ఆసరాగా చేసుకుని కొచ్చెర్ల పంచాయతీకి చెందిన కొందరు వ్యక్తులు ట్రాక్టర్లతో సముద్ర దిబ్బ ఇసుక, బుచ్చవానిగెడ్డ ఇసుక రెండు మిక్సింగ్ చేసి సమీప తోటల్లో నిల్వ ఉంచుతున్నారు. అర్ధరాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా భారీ లారీల్లో కల్తీ ఇసుకను అక్రమంగా రవాణా చేసుకుని సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి కల్తీ ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతున్నారు.

విధులకు హాజరైన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు శుక్రవారం విధులకు హాజరయ్యా రు. 34 మంది ఉద్యోగులను తొలగించినట్లు వారికి చెప్పిన అధికారులు ప్రస్తుతం మాట మార్చారు. వర్సిటీలో గురువారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వీసీ, రిజిస్ట్రార్ కార్యాలయాలు ముందు నిరసన తెలియజేయటంతో స్థానిక అధికారులను ఉన్నతాధికారులు నివేదిక అడిగినట్లు సమాచారం. 'సాక్షి'లో వచ్చిన 'పొట్ట కొట్టారు' కథనంపై సైతం వివరణను వర్సిటీ అధికారులను అడిగినట్లు సమాచారం. దీంతో ఉద్యోగుల ను తొలగించ లేదని, ఆందోళనలు చేయవ ద్దని అధికారులు వారిని పిలిపించి చెప్పా రు. దీంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎప్ప టి లాగే విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం ఈసీ సమావేశం కోసం ఉన్నతాధికారుల అనుమతి కోరుతున్నారు. నిబంధనలు పాటించలేదని ఈసీలో పెట్టి ఉద్యోగులను తొలగించాలని భావిస్తున్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 15 వినతులు

కాశీబుగ్గ: కాశీబుగ్గ పోలీసు డివిజన్ కేంద్రంలో నిర్వహించిన ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు పదిహేను వినతులు వచ్చాయి. శుక్రవారం ఉద యం 11.30 నిమిషాలకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌కు విచ్చేసి సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ వేదికలో పదిహేను ఫిర్యాదులు రాగా అందులో 5 భూతగాదాల పైన, 2 ఆస్తి సంబంధాలపైన, 1 శారీరక నేరాలపై, 1 పరిపాలనకు సంబంధించి, పాత ఫిర్యాదులపై 1, ఇతరితర అంశాలతో 5 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ప్రజలు శ్రీకాకుళం వరకు రాకుండా ఇక్కడ గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు.

మహిళల జీవితాలు మారనున్నాయి

- సుభద్ర యోజనతో మేలు
- ఏటా రెండు విడతల్లో రూ.10 వేల ప్రయోజనం
- సీఎం మోహన్‌చరణ్ మాఝి
- పథకం కార్యాచరణ ప్రకటన

భువనేశ్వర్: ఇక నుంచి రాష్ట్రంలోని మహిళల జీవితాల్లో మార్పు రానుందని సీఎం మోహన్ చరణ్ మాఝి అన్నారు. భారతీయ జనతా పార్టీ ప్రధాన ఎన్నికల వాగ్దానాల్లో ఒకటైన సుభద్ర యోజన అమలు కోసం నిర్ధారిత కార్యాచరణను సీఎం మోహన్ చరణ్ మాఝి శుక్రవారం ప్రకటించారు. సుభద్ర యోజన మహిళా సాధికారతకు మార్గనిర్దేశం చేసే చొరవగా పేర్కొన్నారు. 2024–2025 ఆర్థిక సంవత్సరం నుంచి 2028–29 వరకు ఈ పథకం లబ్ధిదారులకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ పథకం అమలుకు రాష్ట్ర మంత్రివర్గం ఈనెల 22న ఆమోదం తెలిపిందని వెల్లడించారు. ఈ కార్యక్రమం కోసం రూ.55,825 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు.

కోటి మంది జీవితాల్లో వెలుగులు

సుభద్ర పథకంతో రాష్ట్రంలోని కోటి మందికి పైగా మహిళల జీవితాల్లో వెలుగులు వస్తాయని సీఎం అన్నారు. 21 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు వయస్సు గల మహిళలందరికీ ఇది వర్తిస్తుందని పేర్కొన్నారు. రాఖీ పూర్ణిమ రోజు, అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) నాడు రూ. 5,000 చొప్పున రెండు విడతలుగా సంవత్సరానికి రూ. 10,000 చెల్లిస్తామని తెలిపారు. ఈ విధంగా అర్హత కలిగిన మహిళా లబ్ధిదారులు 5 ఏళ్లలో మొత్తం రూ.50,000 పొందుతారన్నారు. సుభద్ర సాయం అందించడంలో పారదర్శకతను నిర్ధారించడానికి, ఆధార్ పేమెంట్ బ్రిడ్జ్ సిస్టమ్ (ఏపీబీఎస్) ద్వారా లబ్ధిదారు యొక్క ఆధార్‌తో అనుసంధానపరిచిన సింగిల్ హోల్డర్ బ్యాంక్ ఖాతాకు నేరుగా చెల్లింపు (డీబీటీ) చేయబడుతుంది. లబ్ధిదారులకు సుభద్ర డెబిట్ కార్డు కూడా జారీ చేయబడుతుందని చెప్పారు.

వీరు అనర్హులు

ఆర్థికంగా బలమైన కుటుంబాల్లోని మహిళలు, ప్రభుత్వ ఉద్యోగులు లేదా ఆదాయపు పన్ను చెల్లింపుదారులు ఈ పథకం కింద అర్హులు కాదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అంతేకాకుండా, ఏదైనా ఇతర ప్రభుత్వ పథకం కింద నెలకు రూ.1,500 లేదా అంతకంటే ఎక్కువ లేదా సంవత్సరానికి రూ.18,000 లేదా అంతకంటే ఎక్కువ సహాయం పొందుతున్న మహిళలు కూడా సుభద్ర కింద చేర్చడానికి అనర్హులు.

నమోదు ఇలా...

ఈ పథకం కింద ప్రయోజనాలు పొందేందుకు మహిళలు అంగన్‌వాడీ కేంద్రాలు, మండల కార్యాలయం, మీ సేవా కేంద్రాలు, జన్ సేవా కేంద్రాలు మొదలైన వాటిలో ఉచితంగా లభించే ఫారమ్‌లను నింపడం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. సుభద్ర పథకం లబ్ధి కోసం కాల్ సెంటర్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమం అమలు, పర్యవేక్షణ కోసం మహిళా శిశు అభివృద్ధి శాఖ సుభద్ర సొసైటీని ఏర్పాటు చేస్తుందన్నారు. తమ ప్రభుత్వం త్వరితగతిన ఈ పథకాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటోందని తెలియజేస్తూనే, అర్హులైన మహిళలు ఎవరూ విస్మరించబడకుండా సభలో సభ్యుల క్రియాశీల సహకారాన్ని కోరారు.

కల్తీసారా ఘటనపై విపక్షాల మండిపాటు



స్పీకర్ పోడియంపైకి దూసుకెళ్లేందుకు విపక్షాల యత్నం

భువనేశ్వర్: గంజాం జిల్లాలో చికిటి కల్తీసారా మృత్యు ఘటనపై ప్రతిపక్ష బిజూ జనతా దళ్, కాంగ్రెస్ సభ్యులు రాష్ట్ర శాసనసభలో శుక్రవారం మండిపడ్డారు. మలి విడత సభా సమావేశాల్లో వరుసగా నాలుగో రోజు కూడ ఈ పరిస్థితి నెలకొంది. తీవ్ర గందరగోళం మధ్య సభను స్పీకర్ సూరమా పాఢి ఉదయం 11.30 గంటలకు వాయిదా వేశారు. అనంతరం సభ ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభమైన వెంటనే ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి హూచ్ దుర్ఘటనపై ఎక్సైజ్ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. పరుశరామ్ ఢాడా, జోగేష్ సింగ్, బిస్వా మల్లిక్, రోమాంచ్ రంజన్ బిస్వాల్‌తో సహా పలువురు బీజేడీ ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియంపైకి ఎక్కేందుకు ప్రయత్నించగా, ఇతర ప్రతిపక్ష సభ్యులు పోడియం ప్రాంగణంలో నినాదాలు చేశారు. అక్రమ మద్యం వ్యాపారులతో అధికార పక్ష సభ్యులు చేతులు కలిపారని ప్రతిపక్ష చీఫ్ విప్ ప్రమీలా మల్లిక్ అన్నారు. వారికి వ్యతిరేకంగా చర్య తీసుకోవడం లేదన్నారు. నైతిక కారణాలతో అబ్కారీ శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రతిపక్షాలకు సమాధానంగా చికిటి బీజేపీ ఎమ్మెల్యే మనోరంజన్ ధ్యాన్ సామంతరా మాట్లాడుతూ మహిళా స్పీకర్‌ను ఎలా గౌరవించాలో ప్రతిపక్ష సభ్యులకు తెలియదన్నారు. నిజం చెప్పాలంటే ప్రతిపక్షాలు భయపడుతున్నాయని, ఈ అంశంపై సభలో చర్చించేందుకు వెనుకాడుతున్నారని ధ్వజమెత్తారు.

విపక్షాల ఆరోపణలు నిరాధారం

గంజాం జిల్లా చికిటి మండలం జెనాపూర్ గ్రామంలో కల్తీ సారా మృత్యు సంఘటనపై సభలో విపక్షాలు దుమారం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో శూన్య గంట సమావేశంలో వాయిదా తీర్మానంపై చర్చ పురస్కరించుకుని మంత్రి సమాధానం ప్రవేశపెట్టారు. చికిటి కల్తీ సారా మృత్యు సంఘటనకు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి వాస్తవాలను దాచలేదని సభాముఖంగా స్పష్టం చేశారు. ప్రతిపక్షాల ఆరోపణ పూర్తిగా అబద్ధం, నిరాధారంగా పేర్కొన్నారు. కల్తీ సారా సేవించి 19 మంది ఆస్పత్రి పాలయ్యారన్నారు. ఐసీయూలో 4 మంది, వెంటిలేటర్‌పై 2 మంది చికిత్స పొందుతున్నారని మంత్రి వివరించారు.

బొలంగీర్ జైలులో ఆకస్మిక తనిఖీలు



జైలులో తనిఖీ చేసేందుకు వచ్చిన పోలీసులు

భువనేశ్వర్: బొలంగీర్ జిల్లా జైలులో ఖైదీల మధ్య ఘర్షణ జరిగినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం జైలులో పోలీసులు ఆకస్మిక తనిఖీ జరిపారు. పోలీసు సూపరింటెండెంట్ రిషికేష్ ఖిలారీ నేతృత్వంలోని బృందం బీడీలు, సిగరెట్లు, లైటర్లు, ట్రిమ్మర్ మరియు వివిధ ఆహార పదార్థాలతో సహా అనేక నిషేధిత వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. జైలులోని 12 వార్డులు, ఇతర ప్రాంతాల్లో సోదాలు జరిగాయి. జైలర్ దీనిపై సవివరమైన నివేదికను సమర్పిస్తారన్నారు. నేరస్థులైన బాబులు మహానాడుపై ప్రత్యర్థి వర్గం దాడి చేసిన ఘర్షణపై రిషికేష్ ఖిలారీ మాట్లాడుతూ.. ఘర్షణకు పాల్పడిన వర్గాల సభ్యులను వేర్వేరుగా ప్రత్యేక సెల్‌లలో ఉంచి చర్యలు తీసుకోవాలని జైలు అధికారులను కోరినట్లు తెలిపారు. బయటి నుంచి నిషిద్ధ వస్తువులను జైలులోకి విసిరి ఉండవచ్చని జైలు సూపరింటెండెంట్ సర్వేశ్వర్ సాహు తెలిపారు. జైలు సెలూన్‌కు ఇచ్చిన ట్రిమ్మర్‌ను సెల్‌లో ఉంచడంపై విచారణ జరుపుతామన్నారు. బొలంగీర్ జైలులో 456 మంది ఖైదీలు కిక్కిరిసిపోయిందన్నారు.

2,471కి చేరిన డెంగీ కేసుల సంఖ్య



నీలకంఠ మిశ్రా

భువనేశ్వర్: రాష్ట్రంలో డెంగీ వ్యాప్తి కలవరపరుస్తోంది. గురువారం నాటికి ఈ రోగుల సంఖ్య 2,471కి చేరింది. ఖుర్దా, సుందర్‌గఢ్ ప్రాంతాల్లో డెంగీ రోగుల సంఖ్య ఎక్కువగా ఉందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ నీలకంఠ మిశ్రా తెలిపారు. సుందర్‌గఢ్‌లో 727, ఖుర్దాలో 595 కేసులు ఖరారైనట్లు పేర్కొన్నారు. కటక్, బొలంగీర్, బాలేశ్వర్‌లలో సోకినవారి సంఖ్య వందకు పైగా ఉంది. ఢిల్లీ నుంచి ప్రత్యేక ఆరోగ్య శాఖ బృందం ప్రభావిత ప్రాంతాలను సందర్శించింది. డెంగీ నిర్ధారణ పరీక్షలు ముమ్మరం చేశారు.

ఆందోళన



ఆందోళన చేస్తున్న నర్సింగ్ సేవకులు

భువనేశ్వర్: స్థానిక గాంధీమార్గ్ నడి రోడ్డు మీద నర్సుల వర్గం శుక్ర వారం ఆందోళనకు దిగింది. అఖిల ఒడిశా నర్సింగ్ సిబ్బంది సంఘం పిలుపు మేరకు సామూహిక ధర్నా నిర్వహించారు. తమ దీర్ఘకాల ప్రధాన డిమాండ్ల సాధన కోసం ఈ ఆందోళన చేపట్టినట్లు తెలిపారు.

నకిలీ మావోయిస్టు అరెస్టు



అరెస్టైన సంతోష్‌కుమార్‌ను చూపిస్తున్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, డెబిట్ కార్డులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో ఒక బంగారం వ్యాపారి నుంచి డబ్బులు వసూలు చేసిన నకిలీ మావోయిస్టును మల్కన్‌గిరి పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఖుర్దా జిల్లా రఘునాథ్‌పూర్ గ్రామానికి చెందిన సంతోష్ కుమార్ మహంతి అలియాస్ పింటు అనే వ్యక్తి గూగుల్‌లో సెర్చ్ చేసి కొంతమంది వ్యాపారుల నంబర్లు సేకరిస్తున్నాడు. అనంతరం వారికి కాల్ చేసి డబ్బులు వసూలు చేస్తున్నాడు. దీనిలో భాగంగానే మల్కన్‌గిరికి చెందిన శ్యామ్ అలంకార్ అనే బంగారం దుకాణం వ్యాపారికి కాల్ చేశాడు. తనను తాను మావో కామాండర్‌గా పరిచయం చేసుకొని, డబ్బులు పంపించాలని డిమాండ్ చేశాడు. అలాగే అనిల్ అనే వ్యక్తికి సైతం కాల్‌చేసి డబ్బులు వేయాలని డిమాండ్ చేశాడు. దీంతో అతను మల్కన్‌గిరి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్పీ పీవో సచిన్ పాటిల్ అతని నంబర్‌ను ట్రేస్ చేశారు. అనంతరం ఒక ప్రత్యేక బృందం పోలీసులు ఖుర్దా వెళ్లి సంతోష్ కుమార్‌ను గురువారం రాత్రి అరెస్టు చేశారు. అతడు ఇప్పటివరకు మొత్తం రూ.1.20 లక్షలు వసూలు చేసినట్లు తెలుస్తోంది. నిందితుడి నుంచి మూడు వేర్వేరు సెల్‌ఫోన్లు, మూడు ఏటీఎం కార్డులు, ఒక సిమ్ స్వాధీనం చేసుకున్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఆమదాలవలస: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని ఆమదాలవలసలోని మోనింగివారి వీధి అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ డి.సురేష్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లింగ నిర్ధారణపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతరం అక్కడ నుంచి సచివాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సమాజంలో ఆడబిడ్డలను రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. హెడ్ నర్స్ భూలక్ష్మి, ఫార్మసిస్ట్ చింతాడ వరుణ్ కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ ఉపేంద్ర, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఎ స్.ఎన్ స్వామి ఉన్నారు.

దోమల నివారణపై ప్రత్యేక దృష్టి

ఎల్.ఎన్.పేట: దోమల నివారణపై ప్రత్యేక దృష్టి సారించామని లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు ఎస్.సునీత, పి.ప్రియాంక అన్నారు. బొరమాంబాపురం గ్రామంలో శుక్రవారం దోమల నివారణకు ఫాగింగ్ చేశారు.

విజయవాడలో డెంగీ జ్వరం బారిన పడి చికిత్స పొంది కోలుకున్న తరువాత ఇదే గ్రామానికి చెందిన ద్రోణాద్రి మహేష్ అనే వ్యక్తి బొరమాంబాపురం గ్రామానికి చేరుకున్నాడు. ఆయనకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నామని ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. అయితే గ్రామంలో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయిస్తున్నట్లు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

పోలీసు స్టేషన్లను సందర్శించిన ఎస్పీ

పాతపట్నం, మెళియాపుట్టి, సారవకోట: నేరాలు జరిగిన తరువాత స్పందించే కంటే ముందస్తు సమాచారం తెలుసుకుని నేరం జరగకుండా తగిన చర్యలు తీసుకుంటే సమాజానికి ఎంతో సేవచేసిన వారం అవుతామని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌ను ఎస్పీ పరిశీలించారు. అనంతరం పాతపట్నం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, రికార్డులు పరిశీలించారు. పాతపట్నం సీఐ నల్లి సాయి అలాగే మెళియాపుట్టి పోలీసుస్టేషన్ సందర్శించి నేరాలకు సంబంధించిన విషయాలను ఎస్‌ఐ టి.రాజేష్‌ను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం వసుంధర అంతరాష్ట్ర చెక్‌పోస్ట్‌ను పరిశీలించారు. సారవకోట పోలీసుస్టేషన్‌ను కూడా జిల్లా ఎస్పీ మహేశ్వరరెడ్డి సందర్శించారు. నేర చరిత్ర ఉన్న వారి జాబితా, సిబ్బంది హాజరు తదితర అంశాలను ఆయన పరిశీలించి పలు సలహాలు, సూచనలిచ్చారు. ఏఎస్‌ఐ లక్ష్మీనారాయణ ఉన్నారు.

బావి వివాదంలో పంచాయతీకి అనుకూలంగా తీర్పు

పొందూరు: మండల కేంద్రంలోని వెంకటేశ్వర కాలనీలో పంచాయతీకి, అదే వీధికి చెందిన మహిళకు బావి స్థలం విషయమై వివాదం నెలకొంది. ఈ కేసు కోర్టులో ఉంది. తాజాగా పొందూరు మేజరు పంచాయతీకి అనుకూలంగా తీర్పు వెలువడినట్లు ఈవో ఎస్.రమేష్ శుక్రవారం తెలిపారు. 2016 ఆగస్టు 15న వావిలపల్లి సుజాత పంచాయతీ స్థలాన్ని ఆక్రమించడంతో పాటు స్థలంలో ఉన్న బావిని కొంత మంది రౌడీల సహాయంతో కూల్చి వేశారు. కాలనీ వాసులకు మంచినీరు అందించే బావిని కూల్చడంపై కాలనీవాసులు ఫిర్యాదుతో పంచాయతీ సిబ్బంది అడ్డుకున్నారు. దీనిపై ఇరువర్గాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసును నమోదు చేసి కోర్టుకు అప్పగించారు. దీనిపై వాదోపవాదనలు జరిగాయి.

స్థలం పంచాయతీకి చెందినదిగా గుర్తించడంతో తీర్పు అనుకూలంగా వచ్చింది. కోర్టు ఖర్చులతో అప్పటి పంచాయతీ ఈవో మోహన్‌బాబుకు రూ. 3 వేలు చెల్లించాలని తీర్పు ఇచినట్టు పేర్కొన్నారు.

కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు హైకోర్టు నోటీసులు

భువనేశ్వర్: సంబల్‌పూర్ లోక్‌సభ సభ్యుడు, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు రాష్ట్ర హైకోర్టు తాఖీదులు జారీ చేసింది. మంత్రికి వ్యతిరేకంగా ఎన్నికల అక్రమాల ఆరోపణలతో నమోదైన కేసు ఆధారంగా ఈ నోటీసులు జారీ అయ్యాయి. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వ్యతిరేకంగా ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన సుభాష్ మహాపాత్రో హైకోర్టులో కేసు దాఖలు చేశారు. తప్పుడు నామినేషన్ల దాఖలు, ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్స్ ఆరోపణలతో కేంద్ర మంత్రి వ్యతిరేకంగా దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు.

నేడు రాహు రేఖ అలంకరణ



భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ మందిరంలో శనివారం భాద్రపద కృష్ణ పక్ష పంచమి తిథి పురస్కరించుకుని శ్రీమందిరం రత్న వేదికపై కొలువుదీరిన మూల విరాటులకు రాహు రేఖ అలంకరణ సేవ నిర్వహించబడుతుంది. తొలి భోగ మండప సేవ ముగిసిన అనంతరం ఈ కార్యక్రమం ఆరంభిస్తారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆలయం మూసి వేయబడుతుంది. ఈ వ్యవధిలో భక్తులకు సర్వ దర్శనం తాత్కాలికంగా స్తంభిస్తుంది.

మంత్రి బిభుతి జెనా పరామర్శ



బాలుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి బిభుతి భూషణ్ జెనా

కొరాపుట్: బ్రహ్మపుర పట్టణంలో డ్రైయిన్ హోల్ పడి మృతి చెందిన సాయిరాం పాత్రో (12) కుటుంబాన్ని రాష్ట్ర స్టీల్, గనులు, ట్రాన్స్‌పోర్టు మంత్రి బిభుతి భూషన్ జెనా శుక్రవారం పరామర్శించారు. శుక్రవారం పట్టణంలోని హరడాకండి ప్రాంతంలో లక్ష్మీ నరసింహనగర్ 14వ లైన్‌లో నివసిస్తున్న బాధిత నివాసానికి వెళ్లారు. బాలుడు తండ్రి శివ పాత్రో, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఇటువంటి ఘటనలు మరలా జరగకుండా చూస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు.

చట్టాలపై అవగాహన శిబిరం



35ఎ: శిబిరంలో పాల్గొన్న న్యాయాధికారులు

జయపురం: ఉద్యోగాలు చేసే మహిళలపై జరుగుతున్న శారీరక, మానసిక వేధింపుల నుంచి రక్షణకు ఉన్న చట్టాలపై స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా జడ్జి బిద్యాధర పుష్టి ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. శిబిరంలో పలువురు జడ్జిలు, న్యాయాధికారులు మాట్లాడుతూ న్యాయ చట్టాలపై వివరించారు. ఈ శిబిరంలో సీనియర్ సివిల్ కోర్టు రిజిస్ట్రార్ స్వయం ప్రకాశ్ దాస్, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి సుమన్ జెన, మహిళా కోర్టు జడ్జి అలకానంద మహంతి, ఎస్‌డీజేఎం సంతోష్ కుమార్ బారిక్, జేఎంఎఫ్ అనిమేష్ కుమార్ జెన తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఎలుగుబంటి మకాం



తోటలో సంచరిస్తున్న ఎలుగు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి సమితి చంద్రపూర్ పంచాయతీ కేంద్రానికి సమీపంలో ఒక ఎలుగుబంటి మకాం వేసింది. అక్కడ మొక్కజొన్న తోటలో వారం రోజులుగా ఉండిపోయింది. దీంతో ఆ ప్రాంతంలో వ్యవసాయ పనులకు వెళ్లకుండా గిరిజనులు భయంభయంగా గడుపుతున్నారు. అధికారులు స్పందించి అడవివైపు తరలించాలని కోరుతున్నారు.

జగన్నాథ త్రిపాఠికి నివాళి



మాజీ మంత్రి పద్మిని దియాన్‌ని సన్మానిస్తున్న దృశ్యం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాకు చెందిన దివంగత స్వాతంత్ర్య సమరయోధుడు జగన్నాథ త్రిపాఠి వర్ధంతి కార్యక్రమం జిల్లా కేంద్రంలోని హిర్లిలో ఉన్న ఒక ప్రైవేటు రిసార్టులో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాల సంఘం అధ్యక్షుడు మున్నా త్రిపాఠి, అతని సతీమణి మహిళా హక్కుల పరిరక్షణ సంస్థ కన్వీనర్ కాదంబిని త్రిపాఠిల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఒలింపిక్స్‌లో మెడల్ సాధించిన ద్యుతి చంద్ ముఖ్య అతిథిగా హాజరై వివిధ రంగాల్లోని ప్రముఖులకు సన్మానం చేశారు.

బోరుకు మరమ్మతులు



బోరు మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డులో గాంధీ జంక్షన్ వద్ద మురుగు కాలువలు తవ్వారు. ఈ పనుల వలన బోరు పాడైపోయింది. ప్రధాన జంక్షన్‌లో ఉన్న ఈ బోర్‌పై స్థానికులు, బాటసారులు ఆధార పడేవారు. కాలువ పనులు పూర్తయిన తర్వాత సంబంధిత శాఖ అధికారులు ఆ బోరు తమ శాఖ పరిధి కాదని వదిలేశారు. దీనిపై స్థానికులు ఎన్నిసార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయింది. ఇది చూసిన అమె నబరంగపూరియా ఫేస్‌బుక్ గ్రూప్ ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో ప్రజారోగ్య సిబ్బంది వచ్చి బోరుని మరమ్మతులు చేశారు.

పట్టాభిషేకం



ఖదేంద్ర ప్రతాప్ సింగ్ దేవ్ పట్టాభిషేకం చేస్తున్న దృశ్యం

కొరాపుట్: రాజ్యాలు పోయినా రాజ వంశీయులు తమ సాంప్రదాయాలు కొనసాగిస్తున్నారు. శుక్రవారం కలహండి జిల్లా మదన్‌పూర్ రాంపూర్ 30వ మహారాజు పట్టాభిషేకం నిరాడంబరంగా జరిగింది. 29వ రాజు సురేంద్ర ప్రతాప్ సింగ్‌దేవ్ మరణించడంతో అతని సోదరుడు ఖదేంద్ర ప్రతాప్ సింగ్ దేవ్‌కు పట్టాభిషేకం చేశారు. అక్కడి సాంప్రదాయాలు ప్రకారం అర్చకులు చందనం జల్లి శుద్ధి చేశారు. అనంతరం కలహండి మహారాజ్ అనంత ప్రతాప్ సింగ్ దేవ్ తిలకం దిద్ది, పగిడి పెట్టి, రాజ ఖడ్గం అందజేశారు. రాజ వంశానికి చెందిన పండిట్ దివంగత లింగరాజ్ సత్పతి కుమారుడు, మదన్‌పూర్ రాంపూర్ బ్రాహ్మణ సమాజ్ అధ్యక్షుడు శివ ప్రసాద్ సత్పతి వెండి పీటని బహూకరించారు. కార్యక్రమానికి సమీప సంస్థానాలకు చెందిన రాజ వంశీయులు, వంశ పారపర్య సిబ్బంది పెద్ద ఎత్తున హాజరయ్యారు.

ఏనుగుల గుంపు సంచారం



ఏనుగుల గుంపు

రాయగడ: జిల్లాలో గత బుధవారం తెరువలి గ్రామానికి సమీపంలోని అడవిలో సంచరించిన ఏనుగుల గుంపు ప్రస్తుతం తెరువలి మీదుగా అడవి మార్గంలో బిసంకటక్ అడవుల వైపు వెళ్లినట్లు సమాచారం. ఈ గుంపులో ఒక పిల్ల ఏనుగుతో సహా మరో మూడు ఏనుగులు ఉన్నాయని అటవీ శాఖ రేంజర్ కామేశ్వర్ ఆచారి తెలిపారు.

బస్టాండ్ సందర్శన



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్

కొరాపుట్: బ్రహ్మపురలో ప్రధానమైన కొత్త బస్టాండ్‌ని స్థానిక ఎమ్మెల్యే కె.అనిల్ కుమార్ శుక్రవారం సందర్శించారు. బస్టాండ్‌లో కలియతిరిగి ప్రయాణికుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గంజాం జిల్లా ప్రైవేట్ బస్సు యునియన్ సభ్యులతో సమావేశమయ్యారు. బస్సు యూనియన్ సభ్యులు తమ సమస్యలు ఎమ్మెల్యేకి తెలియజేశారు. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం ఎస్.జీ శర్మ, పీడీ అప్పలనాయుడు

రామభద్రపురం: శ్రీకాకుళంలో ఈ నెల 17,18,19 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలలో ఆరికతోట ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. బాలుర జట్టులో ఎం.జ్యోతిప్రకాశ్, డి రాఘువ, బాలికల జట్టులో ఎ.భువనేశ్వరి, కె. మధురిమ, పి జైశ్రీలు ప్రథమ స్థానం సాధించారని పీడీ వి.అప్పలనాయుడు తెలిపారు. ప్రతిభ సాధించిన విద్యార్థులను హెచ్‌ఎం ఎస్.జీ.శర్మ, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా అంతరిక్ష దినోత్సవం




శాటిలైట్, రాకెట్ మోడల్ ఆకారంలో ఏర్పడిన విద్యార్థినులు

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమపాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఆగస్టు 23, 2023వ సంవత్సరంలో చంద్రయాన్ -3 చంద్రుని సౌత్ పోలార్‌పై సాఫ్ట్‌ల్యాండింగై చరిత్ర సృష్టించింది. చంద్రుని దక్షిణ ధృవాన్ని తాకిన మొదటి దేశంగా వరల్డ్ రికార్డు సృష్టించింది భారతదేశం. దీనిలో భాగంగా ప్రతి ఏటా ఆగస్టు 23న నేషనల్ స్పేస్ డేగా సెలబ్రేట్ చేసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. ఈ క్రమంలో సీతంపేట బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు తయారు చేసిన శాటిలైట్ మోడల్, రాకెట్ మోడల్, స్పేస్ స్టేషన్ మోడల్‌ను ప్రదర్శిస్తూ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.పద్మశ్రీ, హెచ్‌డబ్ల్యూవో పాలక అమల, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురంటౌన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ (ఎన్‌ఎంఎంఎస్) స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డిసెంబరు 8 జరగనున్న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ అప్లికేషన్ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ.బీఎస్ఈ. ఏపీ.జీఓవీ.ఇన్‌లో అందుబాటులో ఉందని, నమోదు చేసుకోవడానికి సెప్టెంబరు 6 చివరి తేదీ అని తెలిపారు. నమోదు చేసే సమయంలో విద్యార్థి ఆధార్ కార్డ్‌లో ఉన్న విధంగానే విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు నమోదు చేయాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని జిల్లా ఆదర్శ పాఠశాలలలో 8 వ తరగతి చదువుతూ, కుటుంబ సంవత్సరాదాయం రూ.3లక్షల 50వేలు లోపు ఉన్న విద్యార్థులందరూ ఈ పరీక్ష రాసేందుకు అర్హులని పేర్కొన్నారు. పరీక్ష రుసుము ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు రూ.50, ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇవ్వబడిన ఎస్‌బీఐ లింకు ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు. పూర్తి వివరాల కోసం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో తెలుసుకోవాలని సూచించారు.

పెట్టుబడి నైపుణ్యాలపై అవగాహన



అసోసియేట్ ప్రొఫెసర్ బలరాంను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయనగరం అర్బన్: కళాశాల విద్యార్థి దశ నుంచే ఆర్థిక అక్షరాస్యత, పెట్టుబడి నైపుణ్యాల పెంపుపై అవగాహన పెంచుకోవాలని ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ అండ్ మేనేజ్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.బలరాం అన్నారు. శుక్రవారం స్థానిక గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో స్టాక్ మార్కెట్ అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి స్టాక్ మార్కెట్‌లోని రిస్క్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పించుకోవాలని సూచించారు. స్టాక్ మార్కెట్ అవగాహన వల్ల ఆర్థిక పరిజ్ఞానం, నిర్ణయాత్మక నైపుణ్యాలు మెరుగుపడతాయని చెప్పారు. అనంతరం ముఖ్య అతిథిని ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామ్మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ హెచ్ఓడీ డాక్టర్ ఎస్. వరూధిని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆలోచనా విధానంలో మార్పురావాలి

పురుషుల ఆలోచనా విధానంలో మార్పు రావాలి. మహిళను తన సొంత తల్లి, చెల్లి, అక్కగా భావించే తత్వం అలవరుచుకోవాలి. విధులు నిర్వహించే ప్రదేశాల్లో ఉన్నతాధికారుల ఒత్తిడి ఉండకూడదు. తల్లిదండ్రులు సైతం మగ పిల్లలకు తరచూ కౌన్సెలింగ్ ఇస్తూ ఉండాలి. వారి ప్రవర్తనపై దృష్టి సారించాలి. ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళా వైద్య సిబ్బందికి రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. బాత్‌రూమ్ సదుపాయం, డ్రెస్ చేంజ్ చేసుకునేందుకు ప్రత్యేక గది ఏర్పాటు చేయాలి. ఈ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– ప్రేమకుమారి, హెడ్‌నర్స్, పార్వతీపురం



భయపడేలా చట్టాలు ఉండాలి

వైద్యులపై దాడిచేయాలంటే భయపడే విధంగా చట్టాలు రావాలి. ఐసీయూ, అత్యవసర విభాగాల్లో నిరంతరం పర్యవేక్షించే పోలీస్ వ్యవస్థ ఉండాలి. మహిళలకు ప్రత్యేక రక్షణ కల్పించాలి. వైద్య సిబ్బందికి ప్రత్యేక మహిళా అటెండర్‌ను నియమించాలి. అత్యవసర కేసుల విషయంలో రాత్రి సమయంలో ఆస్పత్రికిరావాల్సి వచ్చినప్పుడు పోలీస్ ప్రొటెక్షన్ కల్పించాలి. ప్రభుత్వం ఈ విషయంలో దృష్టి సారించి చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ అజయ్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ , ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి



నిధులున్నా.. నిర్మాణం కనం

- ఇంజినీరింగ్ నిర్లక్ష్యం-రహదారులకు శాపం
- వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.13 కోట్లు మంజూరు
- సీతంపేట ఐటీడీఏ పరిధిలో 19 రహదారులకు కలగని మోక్షం
- శంకుస్థాపన చేసి 8నెలలైనా ప్రారంభం కాని పనులు
- గిరిజనులకు తప్పని కష్టాలు



పనులు జరగాల్సిన సోమగండి రహదారి

సీతంపేట:

గిరిజన గ్రామాలన్నింటికి పూర్తిస్థాయిలో రహదారులు నిర్మించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎంఎస్ఆర్ఈజీఎస్‌లో రహదారులు మంజూరు చేసింది. రహదారులు మంజూరై 8 నెలలు కావస్తున్నా ఇప్పటికీ పనులు ప్రారంభించని పరిస్థితిలో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్‌శాఖ ఉంది. దీంతో కొన్ని గ్రామాలకు సరైన రహదారులు లేక గిరిజనులకు అవస్థలు తప్పడం లేదు. గిరిజన గ్రామాలకు రహదారుల నిర్మాణం జరిగితే అటవీ ఉత్పత్తులు మార్కెట్‌కు తరలించడానికి, అలాగే జ్వరం, ఇతర వ్యాధులు వచ్చినప్పుడు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల అనారోగ్య పరిస్థితుల్లో అత్యవసర సమయాల్లో 108, ఇతర అంబులెన్సులలో పట్టణ ప్రాంతాల్లో ఉన్న ఆస్పత్రులకు తీసుకు వెళ్లడానికి వీలవుతుంది. ఈ క్రమంలో ఫిబ్రవరిలో సాధారణ ఎన్నికల ముందు వైఎస్సార్ సీపీ హయాంలో సీతంపేట ఐటీడీఏ పరిధిలో పాలకొండ నియోజకవర్గంలో 19 రహదారులు నిర్మించడానికి డ్వామా అధికారులు అనుమతి ఇచ్చారు. అప్పట్లోనే కొన్ని రహదారుల నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, అధికారులు శంకుస్థాపన సైతం చేశారు. అయితే వాటికి ఇప్పటికీ నిర్మాణాలు ప్రారంభించని పరిస్థితి ఉంది.

మంజూరైన రహదారులు ఇవే..

సీతంపేట మండలంలోని గుడ్డిమీదగూడ నుంచి కుమ్మరగండి వయా దబర మీదుగా సీసీ రోడ్డు వేయడానికి రూ.కోటి 20లక్షల వ్యయంతో అంచనాలు రూపొందించారు. అలాగే సవర జజ్జువ నుంచి జాతాపు జజ్జువ, బిన్నిగూడకు రూ.కోటి 30 లక్షలు కేటాయించారు. వెలగాపురం-చాపరాయిగూడ రహదారి నిర్మాణానికి రూ.45లక్షలు, దారపాడు నుంచి దంజుపాయికి రూ.90 లక్షలు, సీఎస్‌పీ రహదారి నుంచి సోమగండికి రూ.60లక్షల నిధులు మంజూరయ్యాయి.

☛ పాలకొండ మండలంలో రూ.40లక్షలతో వెలగాడ నుంచి పీఆర్ రాజుపేట, లుంబూరు సీసీ రహదారికి రూ.80లక్షలు కేటాయించారు. మల్లివీడు నుంచి చంద్రయ్యవలసకు రూ.50లక్షలు, పీహెచ్ రహదారి నుంచి సింగన్నవలసకు రూ.30లక్షలు, ఎం.సింగుపురంలో మరో సీసీ రహదారికి రూ.40లక్షలు కేటాయించారు.

☛ భామిని మండలంలో రూ.60లక్షలతో ఏహెచ్ రోడ్డు నుంచి నేరెడు, మరో రూ.60లక్షలతో దిమ్మిడిజోల నుంచి లోవగూడ, రూ.కోటి 50లక్షలతో జోలమానుగూడ నుంచి బుచ్చిమానుగూడ రోడ్డు, రూ.60లక్షలతో ఘనసర తాటిమానుగూడ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి.

☛ వీరఘట్టం మండలంలో సీఎస్‌పీ రోడ్డు యు.వెంకంపేట, చిదిమి సచివాలయం వరకు రూ.50లక్షలు, అడారు సెంటర్ నుంచి డెప్పివలసకు రూ.50లక్షలు కేటాయించారు. సీఎస్‌పీ రహదారి నుంచి చిట్టిపుడివలస బీటీరోడ్డుకు రూ. కోటి 20లక్షలు, బిటివాడ హైస్కూల్ నుంచి చెబియంవలసకు రూ.40లక్షలు, చిదిమి రోడ్డు నుంచి సీఎస్ఆర్ పేటకు రూ.30లక్షలు కేటాయించారు.

త్వరితగతిన నిర్మించాలి



త్వరితగతిన రహదారులు నిర్మించాలి. ప్రాధాన్యతా క్రమంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మారుమూల ప్రాంతాలకు రోడ్లు మంజూరు చేసింది. రహదారుల నిర్మాణం పూర్తయితే గిరిజనులకు ఇబ్బందులు తొలగు తాయి. అర్ధాంతరంగా ఆగిన రహదారులు కూడా ఉన్నాయి. వాటిని కూడా సకాలంలో పూర్తి చేయాలి

విశ్వాసరాయి కళావతి, మాజీ ఎమ్మెల్యే

రహదారుల నిర్మాణానికి చర్యలు



నియోజకవర్గంలో పలు రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరైన మాట వాస్తవమే. కొన్ని కారణాల వల్ల పనులు జరగలేదు. త్వరలోనే పనులు పూర్తిస్థాయిలో జరిగేలా చూస్తాం. దశలవారీగా పూర్తి చేయడానికి చర్యలు తీసు కుంటాం.

సింహాచలం, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ

ధాన్యం సేకరణ సజావుగా జరగాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జేసీ సేతుమాధవన్

విజయనగరం అర్బన్: పొలం నుంచి మిల్లర్‌కు వెళ్లే వరకు అవసరాలన్నిటినీ ఏర్పాటు చేసుకుని ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన వాహనాలు, గన్నీ సంచులు, హమాలీలు, తేమ యంత్రాలు, గోడౌన్ సామర్థ్యం, బ్యాంకు గ్యారంటీలు, తూనిక యంత్రాలు తదితర సామగ్రిని నెలరోజుల ముందే ఏర్పాటు చేసుకుని సిద్ధంగా ఉండాలని సూచించారు. అలాగే ధాన్యం సేకరణలో పని చేసే సిబ్బందికి శిక్షణ పూర్తి చేయాలని చెప్పారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులు, ఎఫ్‌పీఓలు, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది 4.5 లక్షల మెట్రిక్ టన్నుల పంట వస్తుందని అంచనా వేస్తున్నామని ప్రభుత్వం 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ధాన్యం మద్దతు ధర క్వింటాకు కామన్ వెరైటీ రూ.2300గా, గ్రేడ్ ఎ వెరైటీ రూ.2,320గా నిర్ణయించినట్లు ప్రకటించారు. ఈ ధరలను గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రతి రైతుకు తెలిసేలా అవగాహన కలిగించాలని సూచించారు. అదే విధంగా రైతు సేవా కేంద్రాల్లో కరపత్రాలు, పోస్టర్ల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు. సమావేశంలో జేసీ సేతు మాధవన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన టైమ్ లైన్ ప్రకారం ధాన్యం సేకరణ జరిగేలా సమన్వయంతో పనిచేయాలని కోరారు. రైస్ మిల్లర్ల సమస్యలపై బకాయిలపై ప్రభుత్వానికి లేఖ రాసి పరిష్కరించనున్నట్లు తెలిపారు. నవంబర్ 1 నుంచి ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉండాలని లక్ష్యాన్ని చేరుకునేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం



రైలు పట్టాలపై మృతదేహం

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి–బోడసింగిపేట గ్రామాల మధ్య రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గమనించినట్లు విజయనగరం రైల్వే ఎస్సై బాలాజీరావు శుక్రవారం తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మృతుని వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని, మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లేవని, రైలు పట్టాలు దాటుతుండగా కానీ, రైలు నుంచి జారి పడి కానీ మృతి చెందాడా? అన్నది తెలియరాలేదని చెప్పారు. మృతదేహాన్ని విజయనగరంలోని మహరాజా కేంద్రాస్పత్రిలో భద్రపరిచామని, మృతుని చేతిపై ఇంద్రాదేవి అన్న పచ్చబొట్టు ఉందని తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 9666122722,9491813163 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గరివిడిలో మరో గుర్తు తెలియని వ్యక్తి..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి పట్టణానికి కొద్దిపాటి దూరంలో రైల్వే పట్టాల సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు శ్రీకాకుళం జీఆర్‌పీ ఎస్సై ఎం.మధుసూదనరావు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు 64 సంవత్సరాలు ఉండొచ్చని, శరీరంపై కాషాయం రంగు లుంగీ, తెలుపు రంగు కమీజు ధరించి ఉన్నాయని చెప్పారు. వివరాలు తెలిసిన వారు ఫోన్ 9491106219 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బిత్రపాడు అరటితోటలో ఏనుగులు



అరటి తోటలో సంచరిస్తున్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు, బట్లభద్ర, నిమ్మలపాడు పంట పొలాల్లో ఏనుగులు శుక్రవారం ఉదయం దర్శనమిచ్చాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పామాయిల్ తోటలో ఉండి గుమ్మడిగెడ్డ వాగులోకి జారుకున్నాయి.సాయంత్రానికి నిమ్మలపాడు నుండి బిత్రపాడు పరిసర ప్రాంతాల్లోని అరటితోటల్లోకి చొచ్చుకు వచ్చాయి.

చీకటి పడిన సమయంలో మళ్లీ గ్రామంలోకి వస్తాయని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా అటవీ సిబ్బంది వాటిని తరలించే ప్రయత్నం చేయాలని కోరుతున్నారు.

ఆరు కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

శృంగవరపుకోట: అక్రమంగా బైక్‌పై గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను ఎస్.కోట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం ఉదయం 8గంటల సమయంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఎస్‌కోట ఎస్సై సీహెచ్.గంగరాజు నేతృత్వంలో సిబ్బంది వాహన తనిఖీలు చేస్తుండగా అరకు నుంచి వైజాగ్ వైపు స్కూటీపై వెళ్తున్న ఇద్దరు యువకులను ఆపి సోదా చేయగా వారి వద్ద ఆరు కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని, స్కూటీని సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. అదుపులోకి తీసుకున్న యువకులను అరుకువేలీకి చెందిన శెట్టి ఉదయ్‌కుమార్, తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన గుండాల యేసుగా గుర్తించి, నిందితులను రిమాండ్‌కు తరలించామని సీఐ వీఎస్.మూర్తి తెలిపారు.

దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: పట్టణంలోని బాలాజీనగర్‌లో గల ఇందు రెసిడెన్సీలో చోరీకి పాల్పడిన దొంగను వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ శుక్రవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆగస్టు 10న ఇందు రెసిడెన్సీలోని ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తలుపులు, తాళం విరగ్గొట్టి లోనికి చొరబడి విలువైన వెండి వస్తువులను దుండగుడు చోరీ చేశాడు. అదేవిధంగా ఆగస్టు 12న స్థానిక శ్రీనివాస కళాశాల దగ్గర ఎవరూ లేని సమయంలో ఇంట్లోకి ప్రవేశించి ఇంటి తలుపులు విరగ్గొట్టి ఇంట్లో చొరబడి లక్ష రూపాయల విలువైన వాచ్, కొంత నగదు, యాపిల్ ఫోన్ ఇయర్ బడ్స్‌ను దొంగిలించాడు. ఈ రెండుకేసులకు సంబంధించి బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన వన్‌టౌన్ పోలీసులు వాహన తనిఖీలు చేపడుతున్న సమయంలో శుక్రవారం ఉదయం 7.30 గంటల సమయంలో రైల్వేస్టేషన్ ప్రాంతంలో నిందితుడ్ని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. విచారణలో తెలంగాణ రాష్ట్రంలోని సిద్దిపేట, కొండపాక మండలానికి చెందిన డి.లింగం నేరం ఒప్పుకోగా అరెస్ట్ చేసి లక్షకు పైగా విలువ కలిగిన వాచ్‌ను , ఇయర్ ప్యాడ్స్, వేరే కేసులో వెండి ఆభరణాలు రికవరీ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కేసుల్లో నిందితుడ్ని పట్టుకునేందుకు చాకచక్యంగా వ్యవహరించిన క్రైమ్ ఎస్సై జె.తారకేశ్వరరావు, సిబ్బంది అచ్చిరాజు, కానిస్టేబుల్ గౌరీశంకర్, శివ, శ్రీనివాస్, ఇతర సిబ్బందిని డీఎస్పీ అభినందించినట్లు సీఐ తెలిపారు.

ఆటో, బైక్ ఢీకొని మహిళ మృతి

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మక్కువ మండలంలోని దబ్బగెడ్డ గ్రామానికి చెందిన ఇప్పాకుల పార్వతమ్మ(59) తన మనుమరాలు యాగాటి మంజును ఆశ్రమపాఠశాలలో 3వతరగతిలో చేర్పించేందుకు బయల్దేరింది. అయితే ఆ బాలిక రెండో తరగతి చదివిన పాఠశాలలో టీసీ తీసుకునేందుకు మనుమరాలు, మరో వ్యక్తితో కలిసి పాచిపెంట మండలం కర్రివలసకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా పి.కోనవలస జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న ఆటోను ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో బైక్‌పై నుంచి రోడ్డుపై జారిపడి తీవ్రంగా గాయపడిన పార్వతమ్మను స్థానికులు వెంటనే సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరం తరలించేందుకు ప్రయత్నిస్తుండగా అంతలోనే మృతిచెందింది. ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై శ్యామ్ తెలిపారు.

సుమను విధుల్లోకి తీసుకోవాలి

- సీఐటీయూ డిమాండ్
- మున్సిపల్ కమిషనర్‌కు వినతి



మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మున్సిపాలిటీ కార్యాలయంలో పని చేస్తున్న పువ్వల సుమపై ఎటువంటి సాక్ష్యాధారాలు లేకుండా విధులనుంచి తప్పించడం అన్యాయమని, వెంటనే ఆమెను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కొన్ని రోజులుగా పువ్వల సుమపై వస్తున్న ఆరోపణలపై పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్‌తో సీఐటీయూ నాయకులు శుక్రవారం చర్చించారు. ఆమెపై వస్తున్న ఆరోపణలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆధారాలతో సహా రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అంతే కానీ నేరం రుజువుకాక ముందే విధులను నిర్వర్తించకుండా నిలిపివేయడం అన్యాయమని మండిపడ్డారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు వి.ఇందిర, కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ ఇది కేవలం రాజకీయ కక్షపూరిత చర్యలలో భాగమని, ఫిబ్రవరి నెలలో విధుల్లో చేరిన పువ్వల సుమపై లేని ఆరోపణలు, ఒత్తిళ్లు ఈ మధ్య కాలంలో ఏమిటని ప్రశ్నించారు. కార్మికులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు చేపట్టాలి తప్ప, పూర్తిగా విధుల నుంచి తొలగించడం అన్యాయమని, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులపై రాజకీయ ఒత్తిళ్లు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బంకురు సూరిబాబు, ఎస్. ఉమామహేశ్వరరావు, పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి



సన్యాసినాయుడు మృతదేహం

గుర్ల: మండల కేంద్రంలోని ఏపీజీవీబీ బ్రాంచ్ కార్యాలయం మేడపై మద్యం మత్తులో ఒక వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. శుక్రవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గుర్ల గ్రామానికి చెందిన బోడసింగి సన్యాసినాయుడు (40) మద్యానికి బానిసయ్యాడు. కుటుంబసభ్యులతో కలహాలు రావడంతో ఇంటికి కూడా వెళ్లేవాడు కాదు. రెండు నెలలుగా విపరీతంగా మద్యం తాగుతు ఉండేవాడు. ఏపీజీవీబీకి వచ్చిన ఖాతాదారులకు చెడు వాసన రావడంతో కార్యాలయం మేడపైకి వెళ్లి పరిశీలించగా అక్కడ సన్యాసినాయుడు మృతదేహం ఉండడంతో స్థానికులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మద్యం మత్తులో నీరు అందక మృతి చెంది ఉంటాడని, మూడు రోజుల క్రితం మరణించినట్లు మృతుని కుటుంబసభ్యులు చెబుతున్నారు. మృతునికి భార్య సత్యవతి , కుమారుడు, కూమర్తె ఉన్నారు. ఫిర్యాదు మేరకు ఏఎస్సై కామేశ్వరరావు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.

వసతిగృహ విద్యార్థికి పాముకాటు

- సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించిన వైద్యులు
- పరిస్థితి విషమించడంతో విజయనగరం రిఫర్



పాముకాటుకు గురై చికిత్స పొందుతున్న విద్యార్థి పురుషోత్తం

చీపురుపల్లి: పట్టణంలోని సమీకృత బాలుర సంక్షేమ వసతిగృహంలో విద్యార్థి పాముకాటుకు గురయ్యాడు. పాము కాటుకు గురైన విద్యార్థిని వసతిగృహ సంక్షేమాధికారులు హుటాహుటిన పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో చేర్పించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం రిఫర్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. నిక సమీకృత బాలుర వసతిగృహంలో పదో తరగతి చదువుతున్న మెరకముడిదాం మండలంలోని రామాయవలసకు చెందిన వెంపడాపు పురుషోత్తం వసతిగృహం సమీపంలో శుక్రవారం ఉదయం 6.30 గంటల సమయంలో వసతిగృహం సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల వద్దకు వేప పుల్ల కోసం వెళ్లాడు. తిరిగి వస్తున్న సమయంలో అదే దారిలో ఉన్న ఆర్‌డీఓ కార్యాలయం ప్రధాన గేటు ఎదురుగా పాము కాటు వేసింది. ఈ విషయం తెలుసుకున్న వసతిగృహ సంక్షేమాధికారి సత్యనారాయణ హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. విద్యార్థిని కాటు వేసింది విషసర్పమేనని వైద్యులు ధ్రువీకరించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం రిఫర్ చేశారు.

విద్యార్థి బయటకు రావడంపై విమర్శలు..

ఇదిలా ఉండగా వసతిగృహం ఆవరణలోనే ఉండాల్సిన విద్యార్థి పురుషోత్తం బయటకు రావడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదయం 6.30 గంటలకు విధుల్లో ఉండాల్సిన వసతిగృహ సంక్షేమాధికారి ఉన్నారా? లేరా? అనే అనుమానాలతో పాటు విధుల్లో ఉంటే విద్యార్థిని బయటకు ఎలా పంపిస్తారనే చర్చ జరుగుతోంది. ఇదే వసతిగృహానికి చెందిన ఓ విద్యార్థి రెండేళ్ల క్రితం పాముకాటుకు గురై తీవ్ర ఇబ్బందులు పడిన అంశం మరోసారి స్థానికంగా చర్చకు వస్తోంది.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ

పాముకాటుకు గురై స్థానిక సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థి పురుషోత్తంను వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పరామర్శించారు. పార్టీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణలు సీహెచ్‌సీకు వెళ్లి విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.